క్లుప్తంగా

'సైనేడ్' హంతకులపై మరో కేసు

తెనాలిరూరల్: బంగారం, నగదు, ఆస్తుల కోసం శీతల పానీయాలు, మద్యంలో సైనేడ్ కలిపి వరుస హత్యలు చేయడం ఇటీవలి కాలంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, మునగప్ప రజినీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అదే యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్, తన తల్లి గుమ్మడి నాగమ్మ (65)ను వీరే హత్య చేశారని భావిస్తున్నట్టు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. గతేడాది సెప్టెంబర్ 23న తన తల్లి మరణించగా సహజ మరణమని భావించామని, అయితే రమణమ్మ, వెంకటేశ్వరిలకు తనతల్లి రూ. 22 వేలు అప్పుగా గతంలో ఇచ్చిందని, వీరు చేసిన హత్యల గురించి ఇటీవల తెలుసుకోవడంతో అప్పు తీర్చకుండా తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానంతో శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

మహాకవి గురజాడ జయంతి



తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో శనివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. లైబ్రేరియన్ కె.రమాదేవి గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు నివాళులర్పించారు. ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు నాటి సమాజంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపి, సంఘ సంస్కరణలకు తన రచనలతో కృషిచేశారని రమాదేవి చెప్పారు. బాల్యవివాహాల నిరోధానికి పాటుపడ్డారని చెప్పారు. ప్రజలందరికీ అర్థమయే వాడుక భాషలో రచనలు చేశారనీ, వీరి రచన 'కన్యాశుల్కం' నాటకానికి సాహితీలోకంలో ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. అందుకే ఆయన్ను 'ఆధునిక కవితా పితామహుడి'గా గుర్తింపు పొందినట్టు వివరించారు.

ప్రతిభను ప్రోత్సహించాలి



తాడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం వారు మరింతగా ముందుకెళ్లేందుకు ఉపయుక్తంగా ఉంటుందని వజ్జా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వజ్జా సాంబశివరావు అన్నారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024 పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన బాలురు, బాలికకు తమ ఫౌండేషన్ తరుపున రూ.10 వేలు పారితోషకం అందజేశారు. విశ్రాంత ఎస్ఆర్ఎం వర్సిటీ వీసీ వజ్జా సాంబశివరావు పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఏటావిద్యార్థులకు ప్రోత్సాహక పారితోషికాలు అందజేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాంబశివరావు గురువు బి.శేషగిరిరావు పేరిట వ్యాయామ ఉపాధ్యాయిని పూదోట అనల కుమారికి ప్రదానం చేశారు. 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ సుదర్శన్, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన



తాడేపల్లిరూరల్: కుంచనపల్లి అరవింద పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శనివారం మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు వదిలితేనే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమేనన్నారు. స్నేహితులు, ఇతరులు మాదక ద్రవ్యాలు వాడమని ప్రలోభ పెడితే ఖచ్చితంగా వద్దు అని చెప్పాలని స్పష్టం చేశారు. విద్యార్థి దశలో ఒకసారి ధూమపానం, మద్యం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రత కోల్పోయి మానసికంగా కృంగిపోవడం జరుగుతుందని వివరించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలు, యువతను డీఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఇందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. 94904 92020 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, అకడమిక్ ఇన్‌చార్జి పద్మా చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, ఉపాధ్యాయులు జె. శ్రీనివాసరావు, బి.కొండా నాయక్, జాన్సన్, ఎం.సాంబిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

కోకాకోలాకు నీటి కేటాయింపు తీర్మానం రద్దు చేయాలి

తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం వినతి



కనెక్టింగ్ పైపులను పరిశీలిస్తున్న సంఘ నేతలు

తెనాలి: పట్టణ ప్రజల కోసం రూ.80 కోట్లపైపైగా వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకంలో కొంత నీటిని కోకాకోలా కంపెనీకి కేటాయిస్తూ ఏడెనిమిదేళ్ల క్రితం మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం మంచినీటి పథకానికి సంబంధించిన కనెక్టింగ్ పైప్‌లైన్లను సంఘ నాయకులు పరిశీలించారు. 2009లో శంకుస్థాపన చేసిన పథకం 2014లో ప్రారంభించారని గుర్తుచేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వ హయాంలో అన్ని ప్రాంతాలకు పైపులైన్లు వేయకుండా, మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా, ప్రజలు మంచినీటి కుళాయి కనెక్షన్లను తీసుకోవటం లేదని ప్రచారం చేసి, తెనాలికి వచ్చే కృష్ణాజలాల్లో కొంత కోకాకోలా కంపెనీకి ఇచ్చేలా మున్సిపాలిటీలో తీర్మానం చేసినట్టు తెలిపారు. ఆ తీర్మానం చేసే రోజుకు మునిసిపాలిటీ వారు ఆ స్కీంను పబ్లిక్ వర్క్స్ దగ్గర్నుంచి హ్యాండోవర్ కూడా చేసుకోలేదన్నారు. తమ సంఘం కోర్టులో కేసు వేసిన తర్వాత హడావుడిగా హ్యాండోవర్ చేసుకున్నట్టు తెలిపారు. అప్పటికి తెనాలిలో చాలా ప్రాంతాల్లో మంచినీటి పైపులు వేయలేదని తెలిపారు. ఇంకా రూ.10 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉన్నప్పటికీ వర్కులు పూర్తయినట్టుగా మున్సిపాలిటీ వారు సర్టిఫై చేసి, హ్యాండోవర్ చేసుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి మరో రూ.5–6 కోట్ల మున్సిపాలిటీ డబ్బును ఖర్చుచేశారని వివరించారు. తమ విజ్ఞప్తి ప్రకారం ప్రస్తుతం కనెక్షింగ్ పైపుల పనులు జరుగుతున్నాయని, అలాగే కోకాకోలాకు నీరు ఇచ్చేందుకు గతంలో చేసిన మున్సిపల్ తీర్మానాన్ని రద్దుచేయాలని కోరారు. సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, ఇతర బాధ్యులు రావూరి శివశంకరరావు, డీవీ సోమయ్య శాస్త్రి, యనమదల రమేష్‌బాబు, లక్కరాజు చిరంజీవి, అబ్దుల్ ఆరీఫ్, అబ్రహాం లింకన్, పోపూరి రామమోహనరావు, సాతులూరు రాజేష్ పాల్గొన్నారు.

ఔషధ దుష్ఫలితాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

తెనాలి: ప్రజలందరూ తమ దైనందిన జీవితంలో ఏదొక ఔషధాలను తీసుకోవటం సహజమని, శరీరతత్వం, ఆహార, ఇతర అలవాట్ల ప్రభావంతో కొన్ని ఔషధాలు ప్రతికూల చర్యలను చూపుతాయని స్థానిక ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణ అన్నారు. జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఫార్మశీ కాలేజీ ఆధ్వర్యంలో పట్టణ చినరావూరులోని పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఔషధ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతికూల చర్యలు ఏర్పడినప్పుడు రోగులు ఎవరికీ ఫిర్యాదు చేయాలనే అవగాహన చాలామందికి ఉండటం లేదన్నారు. ప్రతికూల చర్యలు లేని మందులు తీసుకోవటం ప్రతిఒక్కరి హక్కని, ఒకవేళ మందులు దుష్ఫలితాలను చూపినపుడు ప్రతి మండల, జిల్లా, రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థాయిలో ఫిర్యాదులను స్వీకరించే కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రజలకు సురక్షితమైన మందులు అందించే దిశగా ఇవి ప్రయత్నిస్తాయని వివరించారు. ప్రొఫెసర్ డి.నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మందులు తయారైనప్పటి నుంచి రోగులకు చేరేవరకు, అవి ఏవిధంగా పనిచేస్తాయో నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

మందులు వినియోగించాక ప్రతికూల చర్యలు ఏర్పడితే ఏవిధంగా ఫిర్యాదు చేయాలనే అంశాన్ని సూచించారు. సంబంధిత కరపత్రాలను అందజేశారు. ఐపీఎఎస్ఎన్ మెంటార్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎ.సోనీప్రియాంక, డాక్టర్ టి.లక్ష్మీదుర్గ, నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి పి.రాధిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: నల్గొండ జిల్లాలో ఈ నెల 14 నుంచి 19వరకు జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తెనాలి నాజర్‌పేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని ప్రిన్సిపల్ బిట్టు వినీలా తెలిపారు. అండర్-19 విభాగంలో పి.అభిలాష్ రజత పతకం సాధించడంతో పాటు జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే లాంగ్ జంప్‌లో ఎస్.మజునాథ్ 4వస్థానం, పరుగు పందెంలో ఎస్.చేతస్ చంద్ర, ఎండీ ఖాజా షరీఫ్, లాంగ్‌జంప్‌లోఎ. శ్రేష్ఠ, జావాలింగ్ త్రోలో ఎం.లిపిక మహాలక్ష్మి, తదితరులు ప్రతిభ చూపినట్లు చెప్పారు. వీరందరిని శనివారం పాఠశాలలో అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జె.సూరజ్‌మోహన్,డైరెక్టర్ కె.యానీ అరుణలత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయలు పంపిణీ



తెనాలిఅర్బన్: వరదల వల్ల సర్వం కోల్పోయిన కొల్లిపర మండలం కొత్తూరులంక గ్రామస్తులకు ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీబీఎస్ అజయ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ సురేష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి: స్థానిక వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్, సమైక్య వెండి వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి వంగల మాధవరావు ప్రథమ వర్ధంతి రోజైన శనివారం వారి కుటుంబసభ్యులు, సిబ్బంది సహాయంతో రైల్వేస్టేషన్ వద్ద అన్నదానం చేశారు. శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి సహకారంతో వృద్ధులు, వికలాంగులు, నిరాశ్రయులకు అన్నవితరణ చేశారు. ముందుగా మాధవరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, స్టాఫ్ అమీర్, ఖాజా, సునీల్, షారుక్, మౌలాలి, మహేష్, వెంకట్రావ్, రాజేంద్రప్రసాద్, నాగార్జున, లూర్దుబాబు, గోపి, జీవన్, అఖిల్, నఫీజ్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధ విపత్తు నుంచి ప్రజలను రక్షించాలి

'ఇస్కఫ్' జిల్లా నాయకురాలు శ్రీదేవి



శాంతి దినోత్సవంలో మాట్లాడుతున్న శ్రీదేవి

తెనాలి: ప్రజలను యుద్ధ విపత్తు నుంచి రక్షించడం శాంతి మార్గంలో పయనింప చేయడం మనందరి విద్యుక్త ధర్మమని 'ఇస్కఫ్' జిల్లా నాయకురాలు శ్రీదేవి సూచించారు. పట్టణ గాంధీనగర్ లోని ఇస్కఫ్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవ సభకు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు బెజ్జంకి నాగమణి అధ్యక్షత వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ అధికారికంగా ప్రపంచ శాంతి దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. మన తర్వాతి తరాల వారిని యుద్ధ విపత్తు నుంచి రక్షించడం శాంతియుత మార్గంలో నడిపించడం, న్యాయం అంతర్జాతీయ చట్టం సూత్రాల కనుగుణంగా అంతర్జాతీయ వివాదాలు లేదా శాంతి ఉల్లంఘనకు దారితీసే పరిస్థితులను సర్దుబాటు చేసేందుకు అంతర్జాతీయ శాంతి దినోత్సవం ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. అధ్యక్షత వహించిన నాగమణి మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబరు 21 తేదీన అంతర్జాతీయ శాంతి దినోత్సవం జరుపుతుంటారని చెప్పారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం మేరకు 1982 సెప్టెంబర్ 21వ తేదీ నుంచి శాంతి దినోత్సవం అమలులోకి వచ్చిందన్నారు. అందరూ ఆనందంగా ఉంటే ఆదేశం ప్రగతికి చిహ్నంగా విజయానికి మారుపేరుగా ఉంటుందన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతివారూ కృషి చేయాలన్నారు. నూకల భాస్కరరావు బొల్లిముంత కృష్ణ, విజయసారధి, నీలాంబరం, చందు సూర్య, విజయలక్ష్మి, అనిత, మధుదేవి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేట పులిపాటివారి వీధిలోని రక్షిత మంచినీటి పైపుకు ఏర్పడిన లీకులకు మున్సిపల్ సిబ్బంది శనివారం మరమ్మతులు చేశారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో నీరు అంతా వృద్ధా శీరిషకతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. తమ సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు సాక్షికి అభినందనలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



పైపుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిగురు ఆశ్రమంలో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా వరద నీటితో మునిగిన సీతానగరంలోని చిగురు అనాథాశ్రమ బాలబాలికలకు వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు శనివారం నిత్యావసరాలు అందజేసినట్లు విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఏఐ, డేటా సైన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వి.జోనితిన్ నీట మునిగిన ఆశ్రమాన్ని సందర్శించి, సాయం అందిస్తామని భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఆయన పిలుపు మేరకు దుస్తులు, దుప్పట్లు, రాత పుస్తకాలు, పెన్నులు, బియ్యం, కందిపప్పు, మినపగుళ్ల, సబ్బులు, బిస్కెట్లు తదితర నిత్యావసరాలను అందజేసినట్లు తెలిపారు. తమ వంతు సాయంగా నిత్యావసరాలు అందించిన ప్రతి ఒక్కరికి వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహించారు. వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.కె.రామకృష్ణారావు, ఏడీఎస్ విభాగాధిపతి డాక్టర్ తిరుపతిరెడ్డి, విద్యార్థి విభాగాధి పతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ వలంటీర్ల బృందాన్ని అభినందించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పెదవడ్లపూడి గ్రామం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి విభాగపు అధికారి డాక్టర్ ఏఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల మానవులకు, జంతువులకు ఎన్నో రకాల ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. అనంతరం సీఈఏ విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



తాడికొండ: మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థులు 26 మంది ఎంపియ్యారని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నెమలికంటి మరియదాసు తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌కు అండర్-14, 17 విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 26 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. నియోజకవర్గ జట్టుకు ఎంపికవడం గర్వకారణమన్నారు. క్రీడలలో ఉత్తమ తర్ఫీదునిచ్చిన పీఈటీ సతీష్, ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. 24న మేడికొండూరు మండలం సిరిపురంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ పి.శేఖర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ లక్ష్మీలావణ్య



ర్యాలీలో పాల్గొన్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 24, 40 వార్డులలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వార్డులలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసున్నారు. అలాగే వార్డుల్లోని మురుగు కాల్వలను బాగు చేయించి రోడ్లపై ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, కో-ఆప్షన్ సభ్యురాలు గోరికపూడి నిర్మలాదేవి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

■ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాతా హీ సేవా కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఎస్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్, ఆర్‌సీఎం ప్రైమరీ స్కూల్, మల్లెపాడులోని మండల ప్రజా పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐ.వీరాంజనేయులు, పీవీ.సుధారాణి,కె.వెంకటేశ్వర్లు, కె.రమేష్, ఎస్.ప్రసన్నదేవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్



కబడ్డీ పోటీలను ప్రారంభించిన కేవీ గోపాలకృష్ణ, పక్కన ఖలేదా నసీమ్

తెనాలి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, చదువుతోపాటు ఆటల్లోనూ పాల్గొనటం శరీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి తోడ్పడుతుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో భాగంగా రెండోరోజైన శనివారం స్థానిక ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో ఆటల పోటీలను మాజీ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, స్కూల్ పూర్వవిద్యార్థి, దాత ఈదర వెంకట పూర్ణచంద్ ప్రారంభించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగం కావాలని సూచించారు. ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. చక్కగా చదువుకుంటూ పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈదర పూర్ణచంద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని చెప్పారు. జయాపజయాలను సమానంగా తీసుకోవాలన్నారు. పూర్వవిద్యార్థి బాబీ జ్యోతులు బహుమతుల కోసం రూ.10 వేల నగదును కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. ఎస్.ప్రసూనాదేవి సభకు అధ్యక్షత వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ కిరణ్, బెల్లంకొండ వెంకట్, శరత్, నలుకుర్తి రమేష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు నదియా, స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటనష్టం నమోదు మరో 30 రోజులు పొడిగించాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వినతి



నందివెలుగులో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

తెనాలి: భారీ వర్షాలు, వరదలకు పంట నష్టం నమోదు ప్రక్రియను మరో 30 రోజులు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం ప్రతినిధి బృందం శనివారం హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో పర్యటించింది. రైతులు, కౌలురైతులను కలిసి పంట నష్టం నమోదులో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉంటున్న భూమి యజమానులు పత్రాలను సకాలంలో ఇవ్వకపోవటం, చాలా భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోవటంతో ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం, సబ్సిడీలను పొందలేకపోతున్నట్టు తులాబందుల వెంకటకృష్ణారావు, గుంపెన ప్రమీలారాణి, శ్రీనివాసరావు ప్రతినిధిబృందానికి చెప్పారు. రుద్రపాటి సుమన్, వల్లూరి వీరబాపూజీలు మాట్లాడుతూ సొసైటీ భూములు, హాఫ్‌పేట, కొలకలూరుకు చెందిన వందలాది ఎకరాల భూములు ఆన్‌లైన్లో నమోదు కాకపోవటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను ప్రభుత్వం ఇప్పటికైనా పరిశీలించి, పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జొన్నా శివశంకరరావు కోరారు. ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే అందజేయాలని కూడా కోరారు. ఆ ప్రకారం నందివెలుగు, హాఫ్‌పేటలో పంచాయతీ కార్యాలయాల్లో వినతిపత్రాన్ని అందజేశారు.

తెనాలిలో మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం



తెనాలిలో జరిగిన ర్యాలీలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ

తెనాలి రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం తొలి బహిరంగసభలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు తెనాలిలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రకటించిన సమయానికి నాలుగైదు గంటల ఆలస్యంగా వచ్చినప్పటికీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక తెనాలి-విజయవాడ రోడ్డులోని వీఎస్వార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ వద్దకు రాత్రి 8 గంటలకు మంద కృష్ణమాదిగ చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచిఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనుకు ఘనస్వాగతం పలికారు. అక్కడ్నుంచి ప్రత్యేక వాహనంపై పోరాటసమితి నాయకులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. విజయవాడ రోడ్డు, ఓవర్‌బ్రిడ్జి, చెంచుపేట మీదుగా మార్కెట్ యార్డులోని సభాప్రాంగణానికి చేరుకునేందుకు రెండు గంటల సమయం పట్టింది. రాత్రి పది గంటలకు సభావేదిక వద్దకు వచ్చారు. ర్యాలీలో అడుగడుగునా కార్యకర్తలు, అభిమానులు పూలవర్షం కురిపించారు. ఎమ్మార్పీఎస్ జెండాలు రెపరెపలాడాయి. మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఆహ్వాన కమిటీ నాయకులు పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్, మేకల రవికుమార్, సుద్దపల్లి సుకుమార్, సుద్దపల్లి మురళీధర్, అత్తోట శ్యామ్, అత్తోట శరత్ తదితరులు పర్యవేక్షించారు. అప్పటికే ఎమ్మార్పీఎస్ నాయకులు, పలువురు ఉన్నతాధికారులు, వివిధ దళిత సంఘాల నాయకులు సభాస్థలిలో ఉన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ



తాడేపల్లిరూరల్ : కొలనుకొండ రైల్వే స్టేషన్ పడమర వైపు నివాసముంటున్న 55 గిరిజన కుటుంబాలకు శనివారం తెనాలి మారిస్‌పేటకు చెందిన ఫ్లేవర్ హెల్ప్‌లెస్ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బిషప్ జాల్ పాల్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజన కుటుంబాలు ముంపునకు గురైనట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు, డాక్టర్ శాస్త్రి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.